# పాలకులు

ఒకనాడు రాజారాం మామ్మూలు మనిషి. ఈనాటికీ మామ్మూలు మనిషివలె అనుకుంటుంటాడు. కానీ లోకులు అతన్నో గంగిగోవుగానో, కల్పవృక్షంగానో, గవ్వలసంచిగానో జమకట్టారు. అతడు ప్రజల మనిషి. అతగాడు విద్యతో వినయం ఒక్కటే సంపాదించలేదు - డబ్బూ, కీర్తీ రెండూ సంపాదించాడు. ముద్దతో నోరుకట్టి డబ్బుతో సభాపతి ననిపించుకున్నాడు. ఐనా లోకుల యెదరగా కొత్త పెళ్ళికూతురిలా లోకువగానే వున్నాడు. అవసరమైతే చాటుగా తేలులా కుట్టాడుగానీ బాహాటంగా కుక్కలా అరవలేదు. తీవ్రంగా యెండ కాచిన్నాడు తనది యేనుగుదేహం అనుకున్నాడు. చిక్కినా శౌర్యం తెచ్చుకోకుండా చాతుర్యంతో బ్రతుకుతున్న రాజారాం యేకాంత భవనంలో-ఎవడో శత్రువు, యెంత సాహసానికి పూనుకున్నాడు!

వచ్చిన వాళ్ళు, వస్తున్నవాళ్ళంతా మిత్రులే. వాళ్ళ అవసరం ఒకనాడు తనకు వుండేది. ఇప్పుడు యితని అవసరం వాళ్ళకున్నది. చెంచురామయ్య చేతిలో నాలుగు గ్రామాల ఓట్లుండినాయ్. సీతామహాలక్ష్మమ్మగారు వాళ్ళ మహిళమండలి సభ్యురాళ్లతో ప్రచారం చెయ్యకపోతే తను ఈనాడు ఇంత వాడయ్యేవాడా? తంబాకు తవిటయ్య సరేసరి. ఒక్క రోజులో ఓటర్లను అటునించి యిటు త్రిప్పేస్తాడు. కాగితం మీద కాకిగోల గొలికిన చేతితోనే, కమనీయమైన కావ్యం రాసి తన కంకితం యిచ్చిన కవికుల తిలకుడు కరుణానిధి తనకో కుడిభుజమయ్యాడు కదూ?

తన అసలు భుజాల ప్రక్కన ఈ భుజాలన్నీ అతికించినవే అని ఆయనకు తెలుసు. ఏనాటికైనా తన అజ్ఞలను తన అంగాలే శిరసా వహిస్తాయిగానీ యివేవీ కావని తెలుసు. వీళ్ళంతా కప్పలనుకున్నా వీటికూతే తన చెరువు నిండే వర్షపు రాకను సూచించాయని తెలుసు. ఈ కప్పలు అందమైన తోకలతో పుట్టినా. లోకపు చెరువులో యీది యీది అలసి అవి విదళించుకున్నాయి.

రాజారాం మిత్రులుగానున్న యిలాంటి శత్రువుల్ని యిప్పుడు వదలించుకోలేదు. ఇప్పుడే చెరువు సముద్రం కాలేదు. కాగలిగితే ఈ కప్పలన్నీ ఆ లోతులెరుగునా? ఈ నలుగుర్లో యే ఒక్కరో యీ సాహసానికి పూనుకున్నారు. వాళ్ళని యెల్లప్పుడూ తను తలచుకోవాలని వాళ్ళ ప్రతినిధిని తన యింట్లో విడిచిపెట్టారు. తన యింట్లో యిదివరకు టార్చిలైట్లు వేసి గాలించినా ఈ రకం ప్రతినిధుల జాడలేదు. ఈ

ప్రతినిధిని గౌరవించినా చిక్కే - గౌరవించకపోయినా చిక్కే. కనికరించినా చిక్కే - కనికరించకపోయినా చిక్కే ఎల్లప్పుడూ విల్లు యెక్కుపెట్టి వుంటాడు. ఆ నారిపోట్లు ఎన్నోసార్లు భరించలేదుగానీ బాగా భరించినవాళ్ళు చెప్పగా విన్నాడు. అనుభవించనిది అంతు తెలీదు. అందుకే ప్రతినిధి అంతసేపై పట్టుకున్నా ఆగాడు.

ఆ పట్టుకున్నది పెద్దవాళ్ళ ప్రతినిధైనా పెద్దవాడు కాదు. ఈ ప్రతినిధి యిందుగలడని అందులేడని సందేహం లేకుండా మెసలుతాడు. బలిసినవాడిని వాహనం చేసుకుని వచ్చినా తొక్కలా పల్చగా వున్నాడు. ఒంటిలో రక్తపు బొట్టులేదు. జాగిపోతూ కదుల్తుండగానే పట్టుబడ్డాడు. ఎక్కడ? తెల్లని లాల్చీవేసుకుని మెత్తని సోఫామీద మొత్తుకున్నా చంకదిగని బిడ్డల్లాంటి ఈ మిత్రులగూర్చి ఒంటరిగా ఆలోచించుకుంటున్నప్పుడు-చప్పున ఆ లాల్చీ చేతిమీద పట్టుబడ్డాడు.

"చంపకు బాబో" అని చేతులెత్తాడు.

"నీ పరిపాలన చాలించు."

"ఏ పరిపాలనకు నేను అడ్డు రాలేదు కదా?"

"మనిషి రక్తాన్ని తాగుతావు చాలదా?"

"మా అమ్మ యింకో రకం తిండి తినటం నేర్పలేదు. నన్నేం చెయ్యమంటావు. అది నా తప్పా?"

"మీ జాతే అంత."

"అయితే నా జాతిని సృష్టించిన దేవునిమీద కసి తీర్చుకోరాదూ? ఆయన బలవంతుడని అతగాడ్ని ప్రార్థిస్తావు. నేను బలహీనుడ్నని నన్ను చంపుతానంటావు."

"మనుషుల రక్తాన్ని పీల్చే బ్రతుకు నీది. నీదీ ఒక బ్రతుకే."

"నన్నేం చెయ్యమంటావ్? పువ్వులని పీల్చే చాకచక్యం దేవుడిచ్చుంటే - తేనెను సృష్టించేదాన్ని."

ఈ నల్లి ఆడనల్లిలా వుంది. రాజారాం మనసులో కొద్దిగా కనికరం అంకురించినా దీని ప్రతాపం విన్నాడుకాబట్టి అంతలో కరిగిపోలేదు. ఈ చిరిగిన తట్టులాంటిది. యింట్లో తట్టెడు పరిగణాన్ని వలగపోసి చింతను తన చెంతకే తెస్తుందనుకున్నాడు. గీత జ్ఞాపకం తెచ్చుకున్నాడు. దుష్ట సంహారణ చేస్తున్నది తనుకాదు. సర్వాధ్యక్షుడైన ఆ దేవదేవుని ఆదేశంతో యిది జరగవలసింది. తను నిమిత్తమాత్రుడు. దీన్ని చంపాలి - చంపి తీరాలి.

"నన్ను చంపకుండా వదలవని నాకు తెలుసు. నన్ను ప్రార్థించుకోనీ."

"ఎవర్ని ప్రార్థిస్తావు?"

"మాకు ఆధారమైనవాడు... రక్షింపవలసిన వాడు... మనిషిని."

"మనిషికీ మీకూ యెంత భేదం?"

"భేదంలేదు రాజారాం ప్రభూ! నిజం చెప్పు, నువ్వు నీటికోసం ఏటిఒడ్డుకు వెళ్తావుగానీ ఎండమావుల దగ్గరకు వెళ్తావా? నీలో నేను లేనూ?"

"ఉన్నావా?"

"ఇంకా నమ్మాలా? అద్దం దగ్గర పెట్టుకుని అందం గురించి యెదుటవాళ్ళ నడుగుతావా? నన్ను చంపేముందు యీ ప్రశ్న నీకు తట్టలేదా?"

రాజారాం సరిగా సోఫామీద కూర్చున్నాడు. "ఏ జన్మలో మనిషి యేడవలేదు? ఎన్నిసార్లు ముఖం కడుక్కోలేదు? ఏ జన్మలో మనిషి పాపం చెయ్యలేదు? ఎన్నిసార్లు చేతులు కడుక్కోలేదు?"

"అబ్బబ్బ యెన్ని ప్రశ్నలు?"

"ఈ ప్రశ్న లెందుకు వేస్తున్నానంటే... నువ్వు తరతరాల మనిషి చేసిన పాప పుణ్యాల, న్యాయాన్యాయాల ప్రతినిధివి. గడచిన జన్మల పాలుతాగి, మాటలు నేర్చి, అడుగులు వేసుకుంటూ పెరిగావు. ఏళ్ళుమారినా, లోకం యీడు ముదిరినా... ఏం మారింది మీ లోకంలో?"

"మారలేదు?"

"ఎప్పటికీ యేడుమాసికల చీరలానే వుంది మీ నరజాతి. ఏడు మెతుకులు యెంతమంది మ్రింగి యేనుగుసత్తువతో కదుల్తున్నారు?"

"చిన్ననోరు... పెద్దమాట లొచ్చాయే?"

"నేను విన్నవి కంఠోపాటం చేసుకుంటూ కన్నవే చెప్తున్నాను. దీన్ని మీ నరజాతికి యీ అల్పమైనజాతి కష్టకాలంలో సమర్పించే స్తుతి అనుకునే కనికరించండి."

"ఏంటా స్తుతి?"

"ఎవరి కంపు వాళ్ళకింపు.

ఎవరి ప్రాణం వాళ్ళకు తీపి.

ఎవరి బిడ్డ వాళ్ళకు ముద్దు.

ఎవరి పిచ్చి వాళ్ళకానందం.

ఎవరికివారే యమునా తీరే.

ప్రభువుల బ్రతుకులే యిలావుంటే మాలాంటి అల్పులు కూటికోసం కోటివిద్య లుకాక, ఒకే విద్యతో బ్రతుకుతుంటే... చెప్పు ప్రభూ, న్యాయాన్ని అమ్ముతావా? దానం చేస్తావా? దానం చేస్తే ఒక్కసారి ఆలోచించు."

రాజారాం లేచిపోయాడు. నల్లిని పట్టుకునే యిటూ అటూ పచార్లు చేశాడు. గుమ్మం దగ్గరకు వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చాడు. చివరకు కిటికీ దగ్గరనిల్చొని నల్లిని బయటకు విసరేశాడు.

విసిరినతర్వాత చప్పున యేదో జ్ఞప్తికి వచ్చింది. అందరికీ మంచివాడుగా కనిపించాలన్న తన ఆతృతలో అంతవేగిరం దొరికిన దొంగని వదలేశాడుతను. ప్రభువు కనికరంతో కాక, తన బావనతో ప్రాణాన్ని దక్కించుకున్నానని ఆ నల్లి అపోహపడగలదు. అఆలు రానిది ఆదర్శాలు వల్లించి అగ్రతాంబూలం పొందానని అనుకోగలదు.

ఎంతదూరం పోగలుగుతుంది? ఇక్కడెక్కడో వుంటుంది. బహుశా యింటిగోడకే అంటుకుని వుంటుంది నిందను ఖండించకపోతే నిజమై నెత్తికెక్కుతుంది. కిటికీ దగ్గర నిల్చునే అన్నాడు –

"ఎవరికివారే యమునాతీరే అన్నావు, కాదు, కాదు మాలో

కష్టాలలో కొండలను మరిపించే వాళ్ళున్నారు.

తోటివాళ్ళు వదలిన మురికిబట్టలను మోసే గాడిదలున్నారు.

అంతా దానం చేసే శిబిచక్రవర్తులు ఉన్నారు.

అవసరమైతే అగ్నిలో కాలు పెట్టేవాళ్ళు.

ఊహాలన్నీ కార్యరూపంలో పెట్టగలిగినవాళ్ళు.

పొట్టా, బట్టాకోసం పాటుబడి ప్రజల దారిద్రాన్ని తగ్గించేవాళ్ళు..."

అటునించి కీచుగొంతుక "అగు... అగు... చాలించు నీ బడాయిలు" అన్నట్లు వినిపించింది. నల్లి గొంతుకే అది. ఆ గొంతులో యిప్పుడు ప్రార్ధన లేదు–వేళాకోళం.

రాజారాం నిదానించి చూశాడు. కళ్ళురజేశాడు. నల్లి చేతికందని దూరంలో నిల్చొని అంటోంది.

"ఆ కొండలు తేలిన మంచునే మోస్తున్నాయి గానీ మనుషుల బరువులను మొయ్యలేదు.

ఆ గాడిదలు గంధపు చెక్కలనే మోస్తానంటాయి.

ఆ శిబిచక్రవర్తులు మోయలేని, అరిగించుకోలేని బరువును దానం పేరుతో దించేసుకుంటున్నారు.

అగ్నిలో ఒక కాలుపెట్టి రెండో కాలును మంచిగంధంలో పెట్తారు.

ఆ వూహాలన్నీ పువ్వులయ్యా! పువ్వులన్నీ కాయలౌతాయా? అనుభవించిన వాళ్ళకు దారిద్ర్యం సుకుమారంగా వుంటుంది."

తనూ ఈ జీర్ణించిన నల్లిలా, మామూలు మనిషిగా వున్నప్పుడు యిలాంటి మాటలే అన్నట్లు గుర్తుకొచ్చింది. ఈ నల్లే బలిసివుంటే కళ్ళు మూసుకుని వుండేది. చెవులు కూడా మూసుకునేది. తినడానికి తప్పించి నోరు తెరచేది కాదు.

ఇలా నల్లి పోయినా నల్లి మనసులో మెసలుతోంది. ఈ నల్లిని వదలించుకున్నాడు గానీ యింట్లో నల్లులలాంటి మనుషుల బెడద తగ్గలేదు. ఎందరెందరు తనను యెన్నెన్ని చెయ్యమంటారు? ఒకరికి చేసే సహాయం యింకొకరి పీకకోసైనా చెయ్యాలిమరి. నిలదొక్కుకున్న చెట్లలాంటి రూల్సునే పక్షపాతం కత్తితో నరకాలి. గోళ్ళతో మీటించవలసిన సమస్యలను గొడ్డళ్ళతో కొట్టవలసినవనుకొని తన సిఫారుసును బలవంతంగానే తీసుకపోతున్నారు. ఆశితులు, ఆప్తులు, ఆదర్శవాదులు అంతా తన పాలిట నల్లులై పోతున్నారు. ఎవర్నీ యేమనలేదు. ఏదో ఒక బంధం, దేనికో ఒకదానికి బద్ధుడైపోతున్నాడు. ఇలా రోజులు గడిచిపోతున్నకొద్దీ నల్లి అన్నమాటలు తనే అనుకున్నట్లు... అన్నట్లు... తనే నల్లినైపోతే యెంత బావుణ్ణు – ఈ వచ్చిన వాళ్ళందరినీ పీల్చేసేవాడు. వీళ్ళ బెడదతగ్గేది.

అలా అనుకునేసరికి–అతని ఘోష ఆ సౌధంబులో యే మూలనించి ఆ నల్లి విన్నదోగానీ–ఆ ఆలోచనలకు పదిరెట్లు డ్రాయింగు రూములో నల్లుల పుట్టలు. ఏ కుర్చీమీదా నల్లులే. వచ్చినవాళ్ళు యెంతసేపో కూర్చోవటంలేదు. బొబ్బలెక్కినట్లు

కరుస్తున్నాయి. మాటాడుతూ మర్యాద కాదనుకున్నా లేచిపోతున్నారు. సగం చెప్పి కదలిపోతున్నారు. ఆపదలనించి తప్పించగలిగినందుకు రాజారాం నల్లిని స్తుతించాడు. తన స్తోత్రాన్ని అందుకున్నాక తనవరకూ రావనుకున్నాడు. సేవకులను వాటిని చంపవద్దన్నాడు. వచ్చినవాళ్ళు నిల్చొనే నివేదించుకొనబోతే బలవంతాన సోఫాలమీద కూర్చోబెట్టున్నాడు. వాళ్ళు ఒక్కొక్కకాటుతో వుక్కిరిబిక్కిరై అసలు విషయం మరచిపోతుంటే అతనికెంతో రిలీఫ్‌గా వుంది. తెగించి ఒకాయన నవ్వుతూనే "ఏమీలేదు సార్. నల్లేనండి. మా యింట్లో నల్లులపుట్టలుండేవి. కొత్త ట్వెక్‌ట్వంటీ కొట్తే చచ్చాయండి," అన్నాడు.

రాజారాం యితను అబద్ధం ఆడాడని నవ్వాడు. నల్లుల పాలనలో పక్షపాతంవుండదని కొద్దిరోజుల్లో తెలుసుకున్నాడు రాజారాం. డ్రాయింగ్ రూమ్‌నించి పడకగదుల్లోనికి ప్రయాణం చేసి... మెల్లగా ఒకటి పదై–పది వందై–వంద వేలయిపోయాయి. ఎక్కడా అవే... తన రక్తమే కాదు... భార్య... పిల్లల రక్తాలు రోజుకో ఔన్సు చొప్పున తాగేస్తుంటే... నిద్దరలేకుండా నీర్సంచేస్తోంటే... అతనికి నల్లి మీదనున్న కనికరం కోపంగా మారిపోయింది. తన యింట్లో డ్రాయింగురూముతో సహా టిక్‌ట్వంటీ విషవాయువు నల్లులపాలిట విజృంభించింది.

ఈ వారంలో తొలిసారి హాయిగా నిద్దర పట్టింది. వచ్చినవాళ్ళు హాయిగా కూర్చున్నా కొందరు అలవాటుకొద్దీ ఒకసారి గాబరాపడేవారు. వెదికినా నల్లి దొరకలేదుగానీ – నల్లిలా పిల్చే మనుషుల సంఖ్య పెరిగిపోతున్నది.

ఇంకో వారం గడిచింది. తెల్లని దుప్పటి పరచిన పరుపుమీద మధ్యాహ్నం కాస్సేపు దొర్లుతున్నాడు. ఏవేవో బెడదలు మనసును వేధిస్తున్నాయ్. అలాంటప్పుడు తనవేపు భయంలేకుండా ఒక నల్లి మెల్లగా ప్రాకుతూ వస్తోంది. మహాప్రళయం వచ్చి అన్నీ తుడుచుకుపోగా మిగిలిన ఒక నల్లి. ఏ గుహాంతర్భాగంలోనో దాగుండి బీభత్సంగా గాక బయటకు వచ్చినట్లు నడుస్తోంది. బహుశః తోటివాళ్లని వెతుక్కుంటూ వస్తోందేమో? లేక యింతమంది ఆత్మీయులు పోయారని యేడుస్తూ కదుల్తోందేమో? లేక సూటిగా తనను మళ్ళీ ప్రశ్నించడానికి వస్తోందా?

అవును – అక్కడనించే ప్రశ్నలు కురిపించేస్తోంది. "ఏం పుట్టుక మీది? తనకుమాలిన ధర్మం అన్నదే మీ జీవితాదర్శం."

రాజారాంకు కోపం వచ్చింది. ఈ ఫిలాసఫీ వినదల్చుకోలేదు. పళ్ళు పటపటలాడించి "భయపడకుండా మళ్ళీ వచ్చావా?" అన్నాడు.

"మా బ్రతుకే సాహసం."

"అయితే చావు" అంటూ నల్లిని పట్టుకున్నాడు. ఇదివరకు తిన్నకాట్లు, నిద్దరలేని రాత్రులు, ఒంటిమీద బొబ్బర్లు అన్నీ జ్ఞప్తికి వున్నాయ్.

"చంపు, వద్దనను. నాలో నా రక్తంలేదు. నాలోవున్న రక్తం మీ యింటికివచ్చే పెద్దమనుషులది. నన్ను చంపితే వాళ్ళను చంపినట్లే."

"అలా అంటే మరీ చంపుతాను."

"ఆగు ఆగు, నాలో నీ భార్య, పిల్లల– నీ రక్తం కూడా వుంది. నన్ను చంపి నీ వాళ్ళనీ నిన్నూ చంపుకుంటావా?"

ఇంతలో డ్రాయింగురూములో ముగ్గురు యేదో కొంపమునిగినట్లు ప్రత్యక్ష మయ్యారు. చేతిలో నల్లిని పట్టుకునే వెళ్ళి నిల్చున్నాడు. వాళ్ళు వినయంగా యేదో చెప్పుకుంటున్నారు. పీకలు కోసే కత్తి, గుండెలో దూసుకుపోయే తుపాకిగుళ్ళూ చుడ్డానికి అందంగానే వుంటాయ్. ఒక్కసారి రాజారాం చర్రున లేచాడు. "మీరంతా నల్లులు... నల్లులు... నల్లులు... పొండి... పోతారా లేదా?"

ఈ ఆవేశంలో తన చేతినించి తప్పించుకోడానికి తంటాలుపడుతున్న నల్లిని నలిపిపారేశాడు – తనలోని నల్లితత్వానికి స్వస్తి చెప్పాడు!

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 19-5-72)

* * *